విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

నార్నూర్, డిసెంబర్ 13 : ఆదివాసులు విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదివాసీ విద్యార్థి సంక్షేమ పరిషత్ మండలాధ్యక్షుడు ఆత్రం జాలీంషాప్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివాసులు పౌష్టికాహారం తీసుకోకపోవడంతో రక్తహీనతతో బాధపడుతున్నట్లు తెలిపారు. తమ ప్రాంత పరిధిలోని దవాఖానల్లో రక్తపరీక్షలు చేయించుకొని పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. తమ పిల్లలను తప్పనిసరిగా పాఠశాలలకు పంపించాలని కోరారు.

సీఆర్టీల సమ్మె నోటీస్ అందజేత

ఇచ్చోడ(సిరికొండ), డిసెంబర్ 13: సీఆర్టీ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు తమను రెగ్యులర్ టీచర్‌గా గుర్తించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 16 నుంచి సమ్మె నిర్వహిస్తున్నట్లు సిరికొండ మండలంలోని రాయిగూడ ఆశ్రమ పాఠశాలలో సీఆర్టీగా విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులు సమ్మె నోటీసును ప్రధానోపాధ్యాయుడు ఆత్రం భాస్కర్‌కు అందజేశారు. కార్యక్రమంలో సీఆర్టీ ఉపాధ్యాయులు గజానంద్ నాయక్, గోవింద్, సునీత, సంజీవ్‌కుమార్, రామకృష్ణ పాల్గొన్నారు.

దౌనెల్లిలో పులి సంచారం

కుంటాల, డిసెంబర్ 13: దౌనెల్లి అటవీ ప్రాంత సమీపంలోని ప్రభుత్వ క్రీడా ప్రాంగణం వద్ద శుక్రవారం పలువురికి పులి కనిపించినట్టు చెప్పగా సమాచారం అందుకున్న అటవీ అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. పులి సంచరించినట్టు ఆనవాళ్లు కనబడలేదని, పాద ముద్రల కోసం ఇంకా వెతుకుతున్నామని ఎఫ్ఎస్ఓ కీర్తి తెలిపారు. ఇక్కడ డీఆర్‌వో రేష్మ, ఎఫ్‌బీఓలు హరిలత, ముస్తాక్, మహేశ్, టాస్క్‌ఫోర్స్ టీం ఉన్నారు.

మొక్కజొన్న పంట పరిశీలన

సోన్, డిసెంబర్ 13 : సోన్ మండలంలోని సిద్ధులకుంట గ్రామంలో రైతులు సాగు చేస్తున్న మొక్కజొన్న పంటను శుక్రవారం ఏవో వినోద్‌కుమార్ పరిశీలించారు. రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. యూరియాను అధిక మోతాదులో వాడరాదని, రసాయన మందుల వాడకంతో పంట దిగుబడి తగ్గుతుందని సూచించారు. కార్యక్రమంలో పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల వద్ద 163 సెక్షన్ అమలు

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 13 : నిర్మల్‌లో ఈ నెల 15,16వ తేదీల్లో నిర్వహించే గ్రూప్-2 పరీక్షల దృష్ట్యా 24 పరీక్షా కేంద్రాల్లో 163 సెక్షన్‌ను అమలు చేస్తున్నామని ఎస్పీ జానకి షర్మిల ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష జరిగే రోజుల్లో ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జిరాక్స్, ఇంటర్ నెట్ సెంటర్లు మూసివేయాలని పేర్కొన్నారు.

రైతు బజార్‌లో నుంచి 3 సెల్ ఫోన్లు మాయం

ఎదులాపురం, డిసెంబర్ 13 : ఆదిలాబాద్‌లోని రైతు బజార్‌లో శుక్రవారం రాత్రి కూరగాయలు కొనుగోలు చేయడానికి వచ్చిన ముగ్గురు వ్యక్తుల జేబులో నుంచి సెల్ ఫోన్లు చోరీకి గురయ్యాయి. రైతు బజార్‌లో రద్దీ ఉండడంతో దొంగలు ఇదే సమయంలో వ్యక్తుల జేబులో నుంచి సెల్ ఫోన్లు దొంగలించారు. రైతు బజార్ నుంచి బయటకు వెళ్లే సమయంలో జేబులో సెల్‌ఫోన్లు చూసుకోగా లేకపోవడంతో ఆశ్చర్యానికి గురయ్యారు. కూరగాయలు కొనుగోలు చేసిన వద్దకు వెళ్లి చూసేసరికి అక్కడ కనబడలేదు. దీంతో వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మూగబోయిన విద్యాబోధన

దస్తురాబాద్‌లో తాళం వేసి ఉన్న ఎమ్మార్సీ కార్యాలయం

దస్తురాబాద్, డిసెంబర్ 13 : విద్యాశాఖలో ముఖ్యమై పనులను ఎస్ఎస్ఏ ఉద్యోగులు చేస్తుంటారు. సమగ్ర శిక్షా ఉద్యోగులు సమ్మెలో పాల్గొనడంతో దస్తురాబాద్‌లోని ఎమ్మార్సీ కార్యాలయానికి తాళం వేసి ఉంది. తమ డిమాండ్లను సాధించుకోవడానికి ఐదు రోజుల నుంచి జిల్లా కేంద్రంలో సమ్మె బాట పట్టారు. దీంతో మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో పని చేస్తున్న సీఆర్పీ, ఐఆర్పీలు సమ్మెలో పాల్గొన్నారు. ఇది వరకే ఎంఈవో గంగాధర్‌కు సమ్మె నోటీస్ అందజేశారు. ఈ నేపథ్యంలో వస్తున్న భోజన నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు.

కేజీబీవీలో నిలిచిన విద్యా బోధన

మండల కేంద్రంలోని కేజీబీవీలోని ఎస్‌వోతో పాటు ఉపాధ్యాయులు కూడా సమ్మెలో పాల్గొనడంతో విద్యార్థులకు విద్యా బోధన నిలిచిపోయింది. కేవలం మెస్ వర్కర్లు మాత్రమే ఉన్నారు. దీంతో బోధన లేక విద్యార్థుల పరిస్థితి అయోమయంలో పడింది. త్వరలో పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నందున విద్యార్థులకు ప్రత్యేక తరగతులు సైతం ప్రారంభమయ్యాయి. ఉపాధ్యాయులు సమ్మె బాట పట్టడంతో విద్యార్థులు చదువు ప్రశ్నార్థకంలో పడింది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కుష్టు నివారణే లక్ష్యంగా చర్యలు



ఇంద్రవెల్లి: వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలకు సూచనలు చేస్తున్న రాష్ట్ర పరిశీలకుడు డాక్టర్ ప్రదీప్

ఎదులాపురం, డిసెంబర్ 13 : కుష్టు నివారణే లక్ష్యంగా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని కుష్టు గుర్తింపు సర్వే రాష్ట్ర పరిశీలకుడు డాక్టర్ ప్రదీప్ కుమార్ అన్నారు. ఆదిలాబాద్‌లోని హామాలీవాడ, అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో ఆశ కార్యకర్తలు నిర్వహిస్తున్న కుష్టు అనుమానితుల గుర్తింపు సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. అనుమానితులు తప్పిపోకుండా చూడాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1,76,426 ఇండ్లకు గాను 1, 54,025 ఇండ్ల సర్వే పూర్తయిందన్నారు. అదే విధంగా 6,39,106 మందిని పరీక్షించి 800 మంది అనుమానితులను గుర్తించడం జరిగిందన్నారు. ఇంకా రెండు రోజుల సమయం ఉందని వంద శాతం పూర్తి చేసేల ప్రణాళికలు చేసుకోవాలని సూచించారు. కుష్టును ముందస్తుగా గుర్తిస్తే నివారణకు చికిత్స పొందవచ్చని తెలిపారు. సర్వేకు వెళ్లే ఆశ కార్యకర్తలు ఏ ఒక్కరూ తప్పిపోకుండా పూర్తి స్థాయిలో వివరాలు నమోదు చేయాలన్నారు. తప్పిదాలు జరిగితే శాఖ పరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నెల 2వ తేదీ నుంచి కుష్టు అనుమానితుల గుర్తింపు సర్వే ప్రారంభమైందని కుష్టు నివారణ అధికారి డాక్టర్ గజానంద్ తెలిపారు. 14 రోజుల పాటు ఇంటింటి సర్వే నిర్వహించి వివరాలు సేకరిస్తున్నామన్నారు. సర్వే కోసం వచ్చే ఆశ, ఆరోగ్య సిబ్బందికి ప్రజలు వివరాలు తెలియజేసి సహకరించాలని కోరారు. ఆయన వెంట కుష్టు నివారణ అధికారి గజానంద్, వామన్ రావ్, సిబ్బంది ఉన్నారు.

ఇంద్రవెల్లి, డిసెంబర్ 13: ఇంద్రవెల్లి పీహెచ్‌సీ పరిధిలోని బుద్ధనగర్, ప్రభుద్ధనగర్‌లో వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న కుష్టు అనుమానితుల గుర్తింపు సర్వేను రాష్ట్ర పరిశీలకుడు డాక్టర్ ప్రదీప్ పరిశీలించారు. వైద్య సిబ్బందితో పాటు ఆశ కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా కుష్టు వ్యాధి ప్రోగ్రాం అధికారి గజానంద్, ఇంద్రవెల్లి పీహెచ్‌సీ డాక్టర్ శ్రీకాంత్, వైద్య సిబ్బంది వామన్‌రావ్, రమేశ్, సురేశ్, జ్యోతి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పైలేరియా నిర్మూలనకు కృషి చేయాలి

నిర్మల్ చైన్‌గేట్: సర్వేను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి రాజేందర్

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్ 13 : నిర్మల్ జిల్లాలో పైలేరియా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎంహెచ్‌వో రాజేం దర్ అన్నారు. నిర్మల్ జిల్లాలోని 18 ప్రాంతాల్లో గురువారం రాత్రి మైక్రో పైలేరియా రక్త నమూనాలు తీసుకొని పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ పైలేరియా అత్యధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి 18 గ్రామాలు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ ప్రాంతాల్లో బ్లడ్ షాంపిళ్లు తీసుకోవడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా వైద్య సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్యక్రమ నిర్వహణ అధికారి రవీందర్‌రెడ్డి, భోజారెడ్డి, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లింగాపూర్‌లో..

కడెం, డిసెంబర్ 13 : లింగాపూర్ గ్రామంలో కడెం పీహెచ్‌సీ సిబ్బంది పైలేరియా సర్వే నిర్వహించారు. హైరిస్క్ ప్రాంతాలను గుర్తించి గురువారం రాత్రి నాలుగు టీమ్‌లుగా ఏర్పడి గ్రామంలో ఇంటింటా సర్వే నిర్వహించినట్లు ఆరోగ్య విస్తరణాధికారి వేణుగోపాల్ తెలిపారు. 300 మంది నుంచి రక్త నమూనాలు సేకరించినట్లు ఆయన తెలిపారు. అయితే సేకరించిన రక్తనమూనాలను శుక్రవారం వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ డాక్టర్ శిరీష పరిశీలించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి సంతోష్, హెల్త్ అసిస్టెంట్లు కొమురయ్య, నర్సయ్య, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

దస్తురాబాద్, డిసెంబర్ 13 : దస్తురాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ విజయ్ కుమార్ ఆదేశాల మేరకు గురువారం రాత్రి భూత్కుర్ గ్రామంలో పైలేరియా వ్యాధి గ్రస్తులను గుర్తించేందుకు వైద్య సిబ్బంది సర్వే నిర్వహించారు. రక్త నమూనాలు సేకరించారు. రాత్రి వేళలో వైద్యాధికారులు, సిబ్బంది విధులు నిర్వహించి మేము ఉన్నామంటూ భరోసా కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఈవో శైలేందర్ కన్నయ్య, హెచ్‌వీ లలిత, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలల సమయాల్లో మార్పులు చేయాలి

ఎదులాపురం, డిసెంబర్ 13 : ఆదిలాబాద్ జిల్లాలో చలి తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా పాఠశాలల సమయాల్లో మార్పులు చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సిర్ర దేవేందర్ పేర్కొన్నారు. ఈ విషయమే శుక్రవారం ఆదిలాబాద్ డీఈవో ప్రణీతను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ విషయమై డీఈవో సానుకూలంగా స్పందించినట్లు ఆయన పేర్కొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి తగు చర్యలు

ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు

ఎదులాపురం, డిసెంబర్ 13 : వినియోగదారులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని విద్యుత్ వినియోగదారుల హక్కుల ఫోరం చైర్మన్ ఎరుకల నారాయణ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్‌లోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఆదిలాబాద్, దస్నాపూర్, మావల, ఆదిలాబాద్ రూరల్ ప్రాంతాల విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదికను ఏర్పాటు చేశారు. లూస్ వైర్లు, అదనపు స్తంభాల ఏర్పాటు, విద్యుత్ బిల్లుల తప్పిదాలకు సంబంధించి 10 అర్జీలు రాగా వాటిలో నాలుగింటిని అప్పటికప్పుడే పరిష్కరించారు. కార్యక్రమంలో ఫోరం సభ్యులు రామకృష్ణ, కిషన్, విద్యుత్ శాఖ ఎస్ఈ జేఆర్ చౌహాన్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష

పీడీకి సమస్యలు వివరిస్తున్న గ్రామస్తులు

సోన్, డిసెంబర్ 13 : సోన్ మండలంలో కడ్తాల్ గ్రామం వద్ద గ్రామస్తులు చేస్తున్న రిలే నిరాహార దీక్ష శుక్రవారం నాలుగో రోజుకు చేరుకుంది. గ్రామం వద్ద నిర్మించిన ఫ్లై ఓవర్ బ్రిడ్జి పక్కన నుంచి సర్వీస్ రోడ్డులో భారీ వాహనాలు వెళ్లడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని నాయకులు, అధికారులను కలిసి విన్నవించారు. ఎన్ హెచ్44 అధికారులు స్పందించి సర్వీస్ రోడ్డుపై వాహనాలు వెళ్లకుండా తాత్కాలికంగా రోడ్డును మూసివేయించారు. తాత్కాలికంగా కాకుండా పర్మినెంట్‌గా చర్యలు తీసుకోవాలని రిలే నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు. కాగా పీడీ శ్రీనివాస్ గ్రామస్తులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తల బస్సుయాత్రను విజయవంతం చేయాలి

కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్13 : ఆశ కార్యకర్తల సమస్యల పరిష్కారానికి ఈ నెల 15 నుంచి 31వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనున్న బస్సుయాత్రను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మన సురేశ్ పిలుపునిచ్చారు. నిర్మల్‌లోని టీఎన్జీవోస్ భవన్‌లో ఆశ కార్యకర్తల యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆశ కార్యకర్తల యూనియన్ సీఐటీయూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్మల్‌లో ఈ నెల 15 న బస్సుయాత్ర ప్రారంభమవుతుందన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గంగమణి, ఆశ కార్యకర్తల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సుజాత, ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి, చంద్రకళ, ఇంద్రమాల, భాగ్యలక్ష్మి, అనసూర్య, శ్యామల, జిల్లా సహాయ కార్యదర్శులు జ్యోతి, శ్యామల, లక్ష్మి, విజయ పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

మాట్లాడుతున్న రాజేశ్‌నాయక్

కడెం, డిసెంబర్ 13 : సమగ్ర శిక్షా ఉద్యోగులను తక్షణమే క్రమబద్ధీకరించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు భూక్యా రాజేశ్‌నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం నిర్మల్‌లో ధర్నా చేస్తున్న ఉద్యోగులకు ఆయన పలువురు నాయకులతో కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర శిక్షా ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్న వారిపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని అన్నారు. 15 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న వీరిని క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్, రాష్ట్ర నాయకుడు భిక్షపతి పాల్గొన్నారు.

బాసరలో మంత్రి సీతక్క

విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

బాసర, డిసెంబర్ 13 : బాసర ట్రిపుల్ ఐటీని శుక్రవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క కలెక్టర్ అభిలాష అభినవ్, ముథోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్‌తో కలిసి సందర్శించారు. విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వీసీ గోవర్ధన్‌ను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు పలు సమస్యలు విన్నవించగా, అధికారులతో మాట్లాడి త్వరలో పరిష్కరిస్తామన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి రూ. కోటి సత్వరమే విడుదల చేయాలని కలెక్టర్‌కు సూచించారు. . ముందుగా బాసరలోని జీఎస్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క హాజరయ్యారు. కార్యక్రమంలో ఎస్పీ జానకి షర్మిల, ఎమ్మెల్సీలు దండే విఠల్, బల్మూరి వెంకట్, శ్రీహరిరావు, మాజీ ఎమ్మెల్యేలు విఠల్‌రెడ్డి, నారాయణ్‌రావుపాటిల్, నాయకులు పాల్గొన్నారు.

మహిళల కోసం రక్షక టీంలు

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్ 13: రాష్ట్రంలో మహిళలపై చిన్నపిల్లలపై జరుగుతున్న దాడులు, హత్యాకాండ నేపథ్యంలో ప్రభుత్వం ద్వారా ప్రతి గ్రామంలో మహిళా రక్షక టీంలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించుకుంటుందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. శుక్రవారం నిర్మల్ కలెక్టర్ సమీకృత భవనంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జూపటేల్, ఎమ్మెల్సీ దండే విఠల్‌తో కలిసి మహిళా శక్తి క్యాంటీన్, విజయ డెయిరీ ఉత్పత్తుల విక్రయ కేంద్రం ప్రారంభించారు. కలెక్టర్ కార్యాలయంలో ప్రభుత్వ అభివృద్ధి పథకాలపై సమీక్ష నిర్వహించారు. మహిళా సంఘాలకు రూ. 400 కోట్ల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో విత్తన కమిటీ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా హాజరయ్యేలా చూడండి

కుభీర్, డిసెంబర్ 13: తమ పిల్లలు సక్రమంగా కళాశాలకు హాజరయ్యేలా తల్లిదండ్రులు దృష్టి సారించాలని ప్రిన్సిపాల్ సునీల్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే 90 రోజుల ప్రణాళికతో చదివితే అత్యుత్తమ ఫలితాలు సాధించేందుకు సహకరించాలని కోరారు. ఇంటి వద్ద సమయానికి పిల్లలు కళాశాలకు వెళ్లేలా చూడాలని కోరారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

లోకేశ్వరం, డిసెంబర్ 13 : పుస్పూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం పీఆర్టీయూ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు తోట నరేంద్రబాబు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు నరేంద్రబాబుకు ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు.

జామ్ గురుకుల ప్రిన్సిపాల్‌గా సంగీత

సారంగాపూర్, డిసెంబర్ 13: జామ్ బాలికల గురుకుల ప్రిన్సిపాల్‌గా సంగీత శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కామారెడ్డి జిల్లా దోమకొండ గురుకులంలో పని చేసి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా రాధిక పని చేశారు. బాధ్యతలు చేపట్టిన ప్రిన్సిపాల్‌ను అధ్యాపకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

పత్తి కొనుగోళ్లు నిలిపివేత

బేల, డిసెంబర్ 13 : మండలంలోని అశపుర జిన్నింగ్ మిల్లులో పత్తి నిల్వలు ఎక్కువ కావడంతో సోమ, మంగళవారాల్లో పత్తి కొనుగోళ్లు నిలిపి వేస్తున్నట్లు వ్యవసాయ మార్కెట్ అధికారి శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలో పత్తి కొనుగోళ్లు చేస్తున్న సీసీఐ అధికారుల సూచన మేరకు నిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. మరల బుధవారం నుంచి యథావిధిగా కొనుగోళ్లు చేపడుతున్నట్లు తెలిపారు. బేల, జైనథ్ రైతులు గమనించి సహకరించాలని కోరారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పరామర్శిస్తున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

భీంపూర్, డిసెంబర్ 13 : భీంపూర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు, మాజీ సర్పంచ్ రాథోడ్ ధరమ్‌సింగ్ మాతృమూర్తి ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులను శుక్రవారం బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల కన్వీనర్ మేకల నాగయ్య, మాజీ జడ్పీటీసీ కుమ్ర సుధాకర్, వైస్ ఎంపీపీ గడ్డం లస్మన్న, నాయకులు లింబాజీ, జహూర్‌అహ్మద్, నరేందర్, జాదవ్ రవీందర్, కల్చాప్‌యాదవ్, రాథోడ్ ఉత్తమ్ ఉన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

పెంబి, డిసెంబర్ 13 : పెంబి మండలం పెంబితండా, ఇటిక్యాల, ఇటిక్యాలతండా గ్రామాల్లో ఎక్సైజ్ శాఖ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. నాటుసారా తయారీకి వినియోగించే బెల్లంపానకాన్ని స్వాధీనం చేసుకొని ధ్వంసం చేశారు. . కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ వసంత్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.

చోరీ కేసులో దొంగ అరెస్టు

ఎదులాపురం, డిసెంబర్ 13: ఆదిలాబాద్‌లోని జైజవాన్ నగర్ కాలనీలో ఈ నెల 8వ తేదీన జరిగిన చోరీ కేసును టూటౌన్ పోలీసులు ఛేదించారు. కేసుకు సంబంధించి వివరాలను టూ టౌన్ సీఐ కరుణాకర్‌రావ్ వెల్లడించారు. ఆదిలాబాద్‌లో శుక్రవారం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన క్రాంతినగర్‌కు చెందిన పాత నేరస్తుడు షేక్ అయాన్ అనే వ్యక్తిని ఐడీ పార్టీ నరేశ్, క్రాంతి, సుధాకర్ రెడ్డి, నరేందర్ శ్రీకాంత్, గోపాల్, ప్రవీణ్ పట్టుకొని విచారించారు. ఇంట్లో చొరబడి రూ.15 వేలు, సెల్ ఫోన్ దొంగతనం చేసినట్లు అంగీకరించినట్లు తెలిపారు. అతని వద్ద నుంచి రూ.5వేలు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించామన్నారు.

గంజాయి స్వాధీనం : వ్యక్తి అరెస్ట్

భీంపూర్, డిసెంబర్ 13 : భీంపూర్ మండలం ఇందిరా నగర్ గ్రామానికి చెందిన జాదవ్ తులసీరాం గంజాయి అమ్ముతున్నాడన్న సమాచారంతో శుక్రవారం జైనథ్ సీఐ సాయినాథ్ ఆధ్వర్యంలో ఎస్ఐ కలీం సిబ్బంది ఆ గ్రామానికి వెళ్లారు. తనిఖీ చేయగా అతని వద్ద 126 గ్రాముల ఎండు గంజాయి దొరికింది. అలాగే ఇంటి పక్కన నాలుగు గంజాయి చెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఆయనపై ఎఫ్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ గంజాయి విలువ రూ. 30 వేలు ఉంటుందని సీఐ తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

ఉట్నూర్ రూరల్, డిసెంబర్ 13: విద్యార్థులకు నాన్యమైన భోజనం అందించాలని అడిషల్ డీఎంహెచ్‌వో కుడ్మెత మనోహర్ అన్నారు. శుక్రవారం మండలంలోని సాలెగూడ గ్రామంలో పాఠశాలను పరిశీలించారు. పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. ఆయన వెంట ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

భార్యలను చంపిన కేసులో భర్తలకు జీవిత ఖైదు

ఎదులాపురం, డిసెంబర్ 13 : భార్యలను చంపిన కేసుల్లో భర్తలకు జీవిత ఖైదిని విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు తీర్పును వెలువరించినట్లు జిల్లా కోర్టు లైజన్ అధికారి ఎం గంగాసింగ్ తెలిపారు. నేరడిగొండ మండలం దేవులనాయక్ తండాకు చెందిన బిడ్‌వార్ రాజు(35)తో బజార్ హత్నూర్ మండలం భూతాయి గ్రామానికి చెందిన బిడ్‌వార్ జమున (26)తో 2014 సంవత్సరంలో పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. వారికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. అ తర్వాత భార్యపై అనుమానంతో తరుచుగా కొట్టేవాడు. చివరికి ఎలాగైన భార్యను చంపాలని ఉద్దేశంతో 30 జూన్ 2021న ఉదయం భార్యను ఇంట్లో గడ్డపారతో తలపై కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న మృతురాలి తండ్రి ధన్‌సింగ్ నేరడిగొండ పోలీసుకు ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్ఐ భరత్‌సుమాన్ వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. పోలీసులు 16 మంది సాక్షులను ప్రవేశపెట్టగా పీపీ ఎం మధుకర్ విచారించగా నేరంరుజువు అయింది. దీంతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్ జీవిత ఖైదీ విధిస్తూ రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పును వెలువర్చినట్లు తెలిపారు.

అక్రమ సంబంధం ఉందని అనుమానంతో భార్యను చంపిన భర్త..

అక్రమ సంబంధం ఉందని అనుమానంతో భార్యను చంపిన కేసులో భర్తకి జీవితకాలం శిక్షతో పాటు రూ.1000 జరిమానాను జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు తీర్పును వెలువరించినట్లు కోర్టు లైజన్ అధికారి గంగాసింగ్ తెలిపారు. ఆదిలాబాద్ రూరల్ మండలం యాపల్‌గూడ గ్రామానికి చెందిన అలిచెట్టి విష్ణు(38) అలిచెట్టి కవిత భార్యభర్తలు వృత్తి కోసం హైదరాబాద్‌కు వెళ్లారు. భార్య అక్రమ సంబంధం ఉందని అనుమానంతో భార్యను చంపాలని పతకం వేసుకున్నాడు. హైదరాబాద్ నుంచి భార్యను తీసుకొని 31 జూలై 2022న రైల్వే ద్వారా ఆదిలాబాద్‌కు వచ్చారు. మరుసటి రోజు 1 ఆగస్టు 2022 ఉదయం జైనథ్ మండలం గిమ్మ ఎక్స్‌రోడ్డు వద్ద దిగి తన అత్తగారింటికి వెళ్తామని రాంపూర్ శివారులోని కుంట వద్ద తీసుకొని వెళ్లి భార్యను బండతో తలపై బలంగా కొట్టి, గొంతుపిసికి చంపాడు. అ తర్వాత జైనథ్ పోలీస్ స్టేషన్‌లో భార్యను హత్య చేశాను అని చెప్పి లొంగిపోయాడు. ఎస్ఐ బీ పెరసిస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కేసు విచారణలో భాగంగా17 మందిని సాక్షులను పీపీ ఎం మధుకర్ విచారించగా నేరంరుజువు అయింది. దీంతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు భర్తకు జీవితకాలం కారగార శిక్ష, రూ.1000 జరిమానా విధించడం జరిగిందన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

లక్ష్మణచాంద, డిసెంబర్ 13: లక్ష్మణచాందకు చెందిన ఇట్టెం స్వప్న